క్లుప్తంగా

ప్రశ్నించే వారిని పెద్దల సభకు పంపాలి



సికిలే స్కూల్‌లో ఎన్నికల ప్రచారం చేస్తున్న ఎమ్మెల్సీ ఇళ్ల వెంకటేశ్వరరావు

నరసాపురం: ప్రశ్నించే వారిని పెద్దల సభకు పంపుదామని ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఇళ్ల వెంకటేశ్వరరావు కోరారు. ఉభయగోదావరి జిల్లాల ఎమ్మెల్సీ పట్టభద్రుల నియోజకవర్గ పీడీఎఫ్ అభ్యర్థి దిడ్ల వీరరాఘవులును గెలిపించాలని కోరుతూ గురువారం ఆయన పట్టణంలో పలు కళాశాలల్లో ప్రచారం చేశారు. శాసనమండలిలో ఉద్యోగులు, నిరుద్యోగుల సమస్యలపై పీడీఎఫ్ సభ్యులే పోరాడుతున్నారని అన్నారు. ఎన్నికల్లో ఇచ్చిన హామీలు పూర్తిగా గాలికి వదిలేసిన కూటమి నాయకులకు ఓటు అడిగే హక్కు లేదన్నారు. ఆయన వెంట సీపీఎం నాయకులు కవురు పెద్దిరాజు, ముచ్చర్ల త్రిమూర్తులు, పొగాకు నారాయణరావు, పొగాకు పూర్ణ ఉన్నారు.

లోక్ అదాలత్‌ను విజయవంతం చేయాలి



సమావేశంలో మాట్లాడుతున్న జడ్జి గంగరాజు

నరసాపురం: జాతీయ లోక్ అదాలత్‌ను మార్చి 8న నిర్వహిస్తామని, ఈ కార్యక్రమాన్ని పూర్తిస్థాయిలో విజయవంతం చేయాలని నరసాపురం సీనియర్ సివిల్ జడ్జి జి.గంగరాజు పోలీసు అధికారులకు సూచించారు. జాతీయ లోక్ అదాలత్ నిర్వహణపై కోర్టు హాలులో జడ్జి నరసాపురం, పాలకొల్లు, యలమంచిలి, మొగల్తూరు మండలాల పోలీసు అధికారులతో గురువారం సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అదాలత్ నిర్వహణపై ప్రత్యేక దృష్టి సారించాలని చెప్పారు. కక్షిదారులకు సమన్యాయం అందించడంలో పోలీసు అధికారుల సమన్వయంతో పనిచేయాలని సూచించారు. లోక్ అదాలత్ ప్రాముఖ్యతను కక్షిదారులకు వివరించాలని చెప్పారు. పారాలీగల్ వలంటీర్ల ద్వారా విస్తృత ప్రచారం చేయించాలని కోరారు. కార్యక్రమంలో నరసాపురం, పాలకొల్లు సీఐలు బి.యాదగిరి, బి.దుర్గేప్రసాద్, జి.శ్రీనివాస్, ఏపీపీ ఎండీ హమీద్ తదితరులు పాల్గొన్నారు.

అంగన్‌వాడీ కార్యకర్తలకు జ్ఞానజ్యోతి శిక్షణ



శిక్షణ తరగతుల్లో మాట్లాడుతున్న మాతా శిశు సంరక్షణ ప్రాజెక్ట్ డైరెక్టర్ సుజాత రాణి

యలమంచిలి: అంగన్‌వాడీ కేంద్రాల్లో ఉంటున్న పిల్లలకు మెరుగైన వసతులు కల్పిస్తూనే వారిలో నైపుణ్యం పెంచడానికి జ్ఞానజ్యోతి శిక్షణ తరగతులు నిర్వహిస్తున్నట్లు మాతా శిశు సంరక్షణ ప్రాజెక్ట్ డైరెక్టర్ సుజాత రాణి చెప్పారు. ఈ మేరకు జిల్లా వ్యాప్తంగా ఆరు రోజులపాటు అంగన్‌వాడీ కార్యకర్తలకు శిక్షణ ఇస్తున్నట్లు ఆయన వివరించారు. కొంతేరు హైస్కూల్‌లో జరుగుతున్న శిక్షణ కేంద్రాన్ని గురువారం ఆమె సందర్శించి, శిక్షణ ఇస్తున్న తీరును కార్యకర్తలను అడిగి తెలుసుకున్నారు. ఆమె వెంట సీడీపీఓ చెల్లుబోయిన ఇందిర, నోడల్ ఆఫీసర్ పి.విజయలక్ష్మి, ఎంఈఓ కనుమూరు వెంకట రామకృష్ణంరాజు, ఐసీడీఎస్ సూపర్‌వైజర్ మహ్మద్ హసీనా, ఉపాధ్యాయులు పి.శ్రీనివాస్, టి.శ్రీనివాస్, పి.రమేష్ తదితరులు ఉన్నారు.

సోలార్ రూఫ్‌టాప్‌తో విద్యుత్ ఆదా



అవగాహన సదస్సులో మాట్లాడుతున్న ఏడీఈ సీహెచ్ రామకృష్ణ

పాలకొల్లు అర్బన్: ప్రతి ఇంటిపైనా సోలార్ రూఫ్‌టాప్ ఏర్పాటు చేసుకుని విద్యుత్‌ను ఆదా చేసుకోవాలని ఎలక్ట్రికల్ ఏడీఈ సీహెచ్ రామకృష్ణ కోరారు. మండలంలోని పూలపల్లి గ్రామ సచివాలయం వద్ద గురువారం సోలార్ రూఫ్‌టాప్‌పై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సదస్సులో ఏడీఏ మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం సబ్సిడీతో పాటు బ్యాంక్ రుణ సౌకర్యం అందిస్తుందన్నారు. సోలార్ రూఫ్ ద్వారా ఆదా చేసిన విద్యుత్‌ను వినియోగదారుడు విద్యుత్ సంస్థకు విక్రయించుకునే వెసులుబాటు ఉందని వివరించారు. పెరుగుతున్న కరెంట్ బిల్లుల భారం నుంచి సోలార్ రూఫ్‌టాప్ ఏర్పాటు చేసుకుని ఉపశమనం పొందవచ్చని వివరించారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి పాలా శ్రీనివాసరావు, ఎలక్ట్రికల్ ఏఈ ఎల్.శ్రీనివాసరావు, ఎల్ఐ ఎన్.వెంకట్రావు తదితరులు పాల్గొన్నారు.

విస్తరణతో ట్రాఫిక్ సమస్యకు చెక్



కవిటం వద్ద రహదారి విస్తరణ పనులు చేస్తున్న దృశ్యం



జిన్నూరు పంచాయతీ వద్ద విశాలంగా మారిన రహదారి



మట్టపర్రు చానల్ పక్కన నిర్మించిన రివిట్‌మెంట్ వాల్

పాలకొల్లు-మార్టేరు రహదారి వేగంగా విస్తరణ

పోడూరు: పాలకొల్లు-మార్టేరు రహదారి(స్టేట్ హైవే) విస్తరణ పనులతో అత్యంత రద్దీగా ఉండే మార్గంలో ట్రాఫిక్ ఇబ్బందులు తొలగనున్నాయి. ఈ రహదారి విస్తరణ, అభివృద్ధి పనులకు గత వైఎస్సార్ సీపీ ప్రభుత్వం హయంలో రూ.25కోట్లు నిధులు మంజూరయ్యాయి. అప్పట్లో పనులు కొంతమేర జరిగినా ఎన్నికల నేపథ్యంలో కొంతకాలం తాత్కాలికంగా పనులు నిలిచాయి. తిరిగి కొద్దిరోజులుగా పనులు వేగవంతంగా జరుగుతున్నాయి. నరసాపురం-అశ్వారావుపేట స్టేట్ హైవేలో భాగమైన ఈ రహదారి చాలా ఏళ్లుగా విస్తరణకు నోచుకోకపోవడంతో పాలకొల్లు-మార్టేరు మధ్య కేవలం 23 అడుగుల వెడల్పుతో ఇరుకుగా ఉండేది. మార్టేరు-అత్తిలి మధ్య, నరసాపురం-పాలకొల్లు మధ్య కొంతమేర గతంలోనే విస్తరణ పనులు చేశారు. పాలకొల్లు-మార్టేరు మధ్య గతంలో 18 ఏళ్ల కిందట పాలకొల్లు నుంచి ఉల్లంపర్రు వరకు దాదాపు 2 కిలోమీటర్లు రోడ్డు వెడల్పు చేశారు. పాలకొల్లు-మార్టేరు మధ్య రహదారి నిత్యం అత్యంత రద్దీగా ఉంటుంది. రహదారి ఇరుగ్గా ఉండడంతో మొన్నటివరకు ఎక్కువగా రోడ్డు ప్రమాదాలు కూడా జరుగుతుండేవి. ప్రస్తుతం ఈ రహదారి వెడల్పును 33 అడుగులకు పెంచి అభివృద్ధి చేస్తున్నారు. పనుల్లో భాగంగా రోడ్డుపక్కన ఆక్రమణలు, చెట్లు తొలగించారు. జగన్నాథపురం, వేడంగి శివారుల్లో అక్కడక్కడా రివెట్‌మెంట్ వాల్ నిర్మిస్తున్నారు. రోడ్డు వెడల్పు పెరగడంతో పాత విద్యుత్ స్తంభాలు తొలగించి కొత్తవి వేస్తున్నారు.

రెండు చోట్ల తగ్గనున్న ఇబ్బందులు..

రహదారిని విస్తరణ పనులతో ప్రధానంగా కవిటం లాకుల వద్ద , జిన్నూరు పంచాయతీ కార్యాలయం వద్ద కల్వర్టు వద్ద వాహనదారులకు ఇబ్బందులు తొలగనున్నాయి. మొన్నటివరకు రహదారి ఇరుగ్గా ఉన్నపుడు ఈ రెండు చోట్ల ప్రమాదాలు ఎక్కువగా జరుగుతుండేవి. ప్రస్తుతం జరుగుతున్న విస్తరణ పనులతో కవిటం లాకుల వద్ద ప్రమాదకరమైన మలుపు దాదాపు సరికావడంతో ప్రమాదాలు తగ్గుతాయని ప్రజలు హర్షం వ్యక్తం చేస్తున్నారు. విస్తరణ పనుల్లో భాగంగా జిన్నూరు పంచాయతీ కార్యాలయం వద్ద రామసేతు కాలువపై మరో కల్వర్టును నిర్మించడంతో ఇబ్బందులు తొలగనున్నాయి. గతంలో ఇక్కడ ఇరుకైన కల్వర్టు కారణంగా తరచూ ట్రాఫిక్ నిలిచిపోయేది. ప్రమాదాలు కూడా జరుగుతుండేవి. రోడ్డు విస్తరణ, అభివృద్ధి పనుల్లో భాగంగా వేడంగి, కవిటం లాకుల మధ్య మట్టపర్రు ఛానల్ పక్కన అక్కడక్కడా రివెట్‌మెంట్ వాల్ నిర్మిస్తున్నారు. అయితే మట్టపర్రు ఛానల్ వెంబడి పూర్తిస్థాయిలో రివెట్‌మెంట్ వాల్ నిర్మించాలని పలువురు విజ్ఞప్తి చేస్తున్నారు.

ప్రమాదాలు తగ్గుతాయి



పాలకొల్లు-మార్టేరు రహదారి విస్తరణతో రోడ్డుపై ప్రమాదాలు తగ్గుతాయి. వాహనాల రద్దీకి తగినంత వెడల్పు లేకపోవడం వల్లే ఈ రోడ్డుపై మొన్నటివరకు ఎక్కువగా ప్రమాదాలు జరిగేవి. అలాగే ఇప్పుడు రోడ్డు విశాలంగా ఉందని కార్లు, టిప్పర్ లారీలు, ద్విచక్ర వాహనాలు వంటివి మితిమీరిన వేగంతో నడపకుండా హెచ్చరిక బోర్డులు ఏర్పాటు చేసి నియంత్రించాలి.

– పిల్లి పెంటయ్య, జిన్నూరు

నాణ్యతా ప్రమాణాలు ఉండేలా చూడాలి..



వాహనాల రద్దీ ఎక్కువగా ఉండే పాలకొల్లు-మార్టేరు రహదారి విస్తరణ పనులు చేయడం చాలా మంచి పరిణామం. ఈ రోడ్డుపై నిత్యం టిప్పర్‌లారీలు, ఇతర భారీలోడు వాహనాలు తిరుగుతుంటాయి. రోడ్డు అభివృద్ధి పనులు పటిష్టంగా, పూర్తి నాణ్యతా ప్రమాణాలు ఉండేలా అధికారులు ఎప్పటికప్పుడు పర్యవేక్షణ చేయాలి.

– పెదపాటి పెద్దిరాజు, సత్యేవారిపేట

ఉపాధి పనుల పరిశీలన



ఉపాధి హామీ పనులను పరిశీలిస్తున్న డ్వామా పీడీ కేసీహెచ్ అప్పారావు

నరసాపురం రూరల్: కూలీలకు పని కల్పించడమే మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం ఉద్దేశమని జిల్లా నీటి యాజమాన్య సంస్థ ప్రాజెక్ట్ డైరెక్టర్ కేసీహెచ్ అప్పారావు అన్నారు. గురువారం నరసాపురం మండలం తూర్పుతాళ్లు పంచాయతీ పరిధిలో నిర్వహిస్తున్న ఉపాధి హామీ పనులను ఆయన పరిశీలించారు. ఈ పథకాన్ని ఉపయోగించుకుని కూలీలు తమ జీవన ప్రమాణాన్ని మెరుగుపర్చుకోవాలన్నారు. ఈయన వెంట నరసాపురం ఎంపీడీఓ గాదిరాజు రామకృష్ణంరాజు, ఏపీఓ శ్రీనివాస్ తదితరులు ఉన్నారు.

బెల్ట్‌షాపు నిర్వాహకుడి అరెస్టు

పోడూరు: పాలకొల్లు ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ స్టేషన్ పరిధిలోని లంకలకోడేరు గ్రామంలో ఎక్సైజ్ ఎస్సై జి.మహేష్, రఘు గురువారం దాడులు నిర్వహించారు. బెల్ట్‌షాపు నిర్వహిస్తున్న ఎం.వీరబ్రహ్మం అనే వ్యక్తిని అరెస్టు చేశారు. అతని వద్ద నుంచి 6 మద్యం బాటిళ్లను స్వాధీనం చేసుకున్నారు. ఎక్కడైనా బెల్ట్‌షాపులు నిర్వహిస్తే చట్టపరంగా చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

కౌలు రైతులకు కిసాన్ క్రెడిట్ కార్డులు ఇవ్వాలి

భీమవరం: కౌలు రైతులకు కిసాన్ క్రెడిట్ కార్డులను తక్షణమే ఇచ్చి స్కేల్ అఫ్ ఫైనాన్స్ ప్రకారం పంట రుణాలు అందించాలని ఏపీ కౌలు రైతుల సంఘం డిమాండ్ చేసింది. గురువారం కలెక్టరేట్‌లోని లీడ్ బ్యాంక్ మేనేజర్ పి.ప్రేమ్‌కుమార్‌కు వినతి పత్రం అందించారు. అనంతరం కౌలు రైతు సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి బుద్దా రమేష్, ఉపాధ్యక్షుడు ఉండి వీరభద్రం మాట్లాడుతూ రూ.2 లక్షల వరకు వడ్డీ, హామీ లేని పంట రుణాలు మంజూరు చేయాలన్నారు. నాలుగు శాతం వడ్డీతో రూ.5 లక్షల వరకు పంట రుణాలు ఇవ్వాలని కోరారు. ఏపీ రైతు సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి వైవీ ఆనంద్ మాట్లాడుతూ పంట సాగుదారు హక్కుల చట్టం 2010 పక్కాగా అమలు చేయాలని జిల్లా వ్యాప్తంగా పెద్ద సంఖ్యలో ఉన్న కౌలు రైతులకు మార్గదర్శకాలు అనుసరించి న్యాయం చేయాలని కోరారు.

దోమల నివారణకు ఫాగింగ్



ఫాగింగ్ చేస్తున్న పారిశుద్ధ్య సిబ్బంది

పాలకొల్లు అర్బన్: పట్టణంలో దోమల బెడద ఎక్కువగా ఉండడంతో ఫాగింగ్ కార్యక్రమాన్ని మునిసిపల్ పారిశుద్ధ్య సిబ్బంది చేపట్టారు. మున్సిపల్ కమిషనర్ బి.విజయసారథి ఆదేశాల మేరకు శానిటరీ సూపర్‌వైజర్ రాజు పర్యవేక్షణలో కల్వర్టులు, వంతెనలు, మురుగు కాలువల్లో దోమల నివారణకు చర్యలు తీసుకున్నారు. ప్రతి రోజూ 6 వార్డుల చొప్పున ఫ్యాగింగ్ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు శానిటరీ సూపర్‌వైజర్ రాజు తెలిపారు.

క్రీడలతో శారీరక, మానసిక ఆరోగ్యం



విజేతలకు బహుమతులు అందజేస్తున్న వైఎస్సార్‌సీపీ నియోజకవర్గ ఇన్‌చార్జి గుడాల గోపి

పోడూరు: క్రీడలతో శారీరక, మానసిక ఆరోగ్యం పెంపొందుతుందనీ వైఎస్సార్ సీపీ నియోజకవర్గ ఇన్‌చార్జి గుడాల గోపి అన్నారు. యలమంచిలి మండలం కొంతేరులో కొంతేరు యువసేన ఆధ్వర్యంలో నిర్వహించిన టెన్నిస్‌బాల్ క్రికెట్ టోర్నమెంట్‌లో విజేతలకు, రన్నర్స్‌కు గురువారం పార్టీ కార్యాలయంలో ఆయన చేతుల మీదుగా రూ.10వేల ప్రైజ్‌మనీ అందజేశారు. ఈ సందర్భంగా గోపి మాట్లాడుతూ క్రీడా పోటీలతో స్నేహభావం పెంపొందుతుందని, యువత చెడు వ్యసనాలకు దూరంగా ఉంటారన్నారు. టోర్నమెంట్ విజేతగా నిలిచిన కొంతేరు టీమ్‌ను, రన్నర్స్‌గా నిలిచిన గొంది, భీమలాపురం జట్లను గోపి అభినందించారు. ఈ కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ మహిళావిభాగం రాష్ట్ర జాయింట్ సెక్రటరీ కర్రా జయసరిత, డీసీఎంఎస్ మాజీ చైర్మన్ యడ్ల తాతాజీ, పార్టీ నాయకులు ఉచ్చుల స్టాలిన్‌బాబు, పెచ్చెట్టి కృష్ణాజీ, పోలుకొండ ఏలియా, చెన్ను విజయ్, కుక్కల రామకృష్ణ, పోలుకొండ వెంకటేశ్వరరావు, శీలం రామారావు, జోగాడ ఉమామహేశ్వరరావు, పాలపర్తి కృపానాథ్, జి.ప్రసాద్, జ్యోతి తదితరులు పాల్గొన్నారు.

కూటమి ప్రభుత్వం హామీలను నెరవేర్చాలి



సమావేశంలో మాట్లాడుతున్న జీవీ సుందర్

పోడూరు: కూటమి ప్రభుత్వం ఎన్నికలకు ముందు ప్రజలకు ఇచ్చిన హామీలు నెరవేర్చాలని గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ ఇండిపెండెంట్ అభ్యర్థి, మాజీ ఎంపీ జీవీ హర్షకుమార్ తనయుడు జీవీ సుందర్ అన్నారు. పాలకొల్లులో గురువారం ఆయన ఓటర్లను కలిసి ప్రచారం నిర్వహించారు. అనంతరం ప్రెస్‌క్లబ్ కార్యాలయంలో విలేకరుల సమావేశంలో మాట్లాడారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి తొమ్మిది నెలలైనా నిరుద్యోగ భృతి ఇస్తామన్న హామీని నెరవేర్చలేదనీ, ఇప్పటివరకు నిరుద్యోగులకు కూటమి ప్రభుత్వం రూ.27 వేలు చొప్పున బాకీ ఉందన్నారు. తనను ఎమ్మెల్సీగా గెలిపిస్తే ప్రతి పార్లమెంట్ నియోజకవర్గం పరిధిలో ఎంప్లాయిమెంట్ కార్యాలయం ఏర్పాటు చేసి గ్రాడ్యుయేట్ పూర్తి చేసినవారందరికీ ప్రభుత్వ, ప్రైవేటు ఉద్యోగాలు కల్పించేలా కృషి చేస్తామన్నారు. ఎమ్మెల్సీ అభ్యర్థి సుందర్ వెంట వైఎస్సార్‌సీపీ నాయకులు ఉచ్చుల స్టాలిన్, మానుకొండ శ్రీను, బండి సుందరరామ్మూర్తి, వడ్లపాటి ఆనందరాజు, ముమ్మిడివరపు ఆంజనేయులు, మట్టా ఆనందకుమార్ ఉన్నారు.

రేపు చాంబర్స్ కళాశాలలో క్యాంపస్ ఇంటర్వ్యూలు

పాలకొల్లు అర్బన్: పట్టణంలోని బీఆర్‌ఆర్ అండ్ జీకేఆర్ చాంబర్స్ కళాశాల ఆవరణలో శనివారం క్యాంపస్ ఇంటర్వ్యూలు నిర్వహిస్తున్నట్లు కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ డి.వెంకటేశ్వరరావు తెలిపారు. ఈ మేరకు గురువారం ఆయన ఓ ప్రకటన విడుదల చేశారు. ఇంటర్వ్యూలు ఉదయం 9గంటల నుంచి మధ్యాహ్నం 2గంటల వరకు నిర్వహిస్తున్నట్లు చెప్పారు. బీఎస్సీ, బీటెక్, ఎంఎస్సీ, బి.ఫార్మసీ, ఎం.ఫార్మసీ ఉత్తీర్ణులై, వయస్సు 21 నుంచి 25 ఏళ్ల వయస్సు లోపు పురుష అభ్యర్థులు మాత్రమే పేర్కొన్నారు. ట్రైనీ సూపర్‌వైజర్, గ్రాడ్యుయేట్ అప్రెంటీస్ ఉద్యోగాలకు నెలకు రూ.18వేల నుంచి రూ.24వేల వరకు జీతంతో పాటు ఉచిత వసతి, భోజనం, పీఎఫ్, ఈఎస్ఐ, ఇతర సౌకర్యాలు లభిస్తాయని వివరించారు. ఇతర వివరాలకు 99120 46234 నంబర్‌కు ఫోన్ చేయాలని సూచించారు.

సామూహిక ఎలుకల నిర్మూలనకు సహకరించాలి



యలమంచిలి: రైతులతో ఎలుకల బొరియలు మూయిస్తున్న మండల వ్యవసాయాధికారి చిందులూరి దేవి



నరసాపురం రూరల్: రైతులతో ఎలుకల బొరియలను మూయిస్తున్న వ్యవసాయాధికారులు

యలమంచిలి: రైతులంతా సామూహిక ఎలుకల నిర్మూలన కార్యక్రమం విజయవంతం చేయడానికి సహకరించాలని మండల వ్యవసాయాధికారి చిందులూరి దేవి కోరారు. సామూహిక ఎలుకల నిర్మూలనా కార్యక్రమంలో భాగంగా గురువారం ఆమె మేడపాడు గ్రామంలో రైతులతో వరి చేల గట్ల మీద ఉన్న ఎలుకల బొరియలు మూయించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ సామూహిక ఎలుకల నిర్మూలనా కార్యక్రమంలో రైతులందరూ భాగస్వాములు కావాలని కోరారు. ముందు రోజు గట్ల వెంబడి తిరిగి ఎక్కడైతే ఎలుకల బొరియలు ఉన్నాయో గుర్తించి వాటిని మట్టితో కప్పివేయాలని కోరారు. మరుసటి రోజు చూసినపుడు ఏ బొరియలు అయితే తెరిచి ఉన్నాయో ఆ బొరియల్లో ఎలుకలు ఉన్నాయని నిర్ధారించి, వాటి వద్ద ఈ బ్రొమోడయోలలిన్ మందుని చిన్న చిన్న పొట్లాలుగా కట్టి పెట్టాలని కోరారు. మండలంలోని అన్ని రైతు సేవా కేంద్రాల వద్ద రైతులకు శుక్రవారం బ్రోమోడయోలిన్ ఎలుకల మందు ఉచితంగా పంపిణీ చేస్తామన్నారు. ఈ అవకాశాన్ని రైతులంతా సద్వినియోగం చేసుకుని ఎలుకల నివారించడం ద్వారా అధిక దిగుబడులు, లాభాలు ఆర్జించాలని ఆమె కోరారు. కార్యక్రమంలో గ్రామ వ్యవసాయ సహాయకురాలు కొంబత్తుల నాగలక్ష్మీ పాల్గొన్నారు.

నరసాపురంలో..

నరసాపురం రూరల్: మండలంలోని అన్ని పంచాయతీలు, రైతు సేవాకేంద్రాల్లో శుక్రవారం ఉచితంగా ఎలుకల నిర్మూలనా మందును రైతులకు అందజేస్తామని వ్యవసాయశాఖ అధికారులు తెలియజేశారు. జిల్లా వ్యాప్తంగా నిర్వహిస్తున్న ఎలుకల నిర్మూలనా కార్యక్రమంలో భాగంగా గురువారం అన్ని గ్రామాల్లో మందుగా ఎలుకల బొరియలను పూడ్చివేశామన్నారు. రైతులంతా ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకుని సామూహిక ఎలుకల నిర్మూలనా కార్యక్రమంలో భాగస్వాములు కావాలని అధికారులు కోరారు.

శివరాత్రి ఉత్సవాలకు సర్వం సిద్ధం



జుత్తిగలో ఉమావాసుకి రవిసోమేశ్వరస్వామి ఆలయ సముదాయం



నత్తారామేశ్వరంలో రామలింగేశ్వరస్వామి ఆలయ సముదాయం



రామలింగేశ్వర ఆలయం వద్ద ఏర్పాట్లు చేస్తున్న దృశ్యం

జుత్తిగ, నత్తారామేశ్వరం క్షేత్రాల్లో ప్రత్యేక ఏర్పాట్లు

పెనుమంత్ర: మహాశివరాత్రి పర్వదినం నేపథ్యంలో పురస్కరించుకుని దక్షిణ కాశీ క్షేత్రంగా పేరుగాంచిన పెనుమంత్ర మండలం జుత్తిగ సోమేశ్వరుడు, నత్తారామేశ్వరంలోని రామలింగేశ్వరుడు, మల్లిపూడిలోని అగస్త్యేశ్వరుడు కల్యాణోత్సవాలు ఈ నెల 23 నుండి 27 వరకు ఘనంగా నిర్వహించేందుకు అన్ని ఏర్పాట్లు చేశారు. 24న రాత్రి జుత్తిగలో శ్రీఉమావాసుకి రవి సోమేశ్వర స్వామి కల్యాణ ఉత్సవం మల్లిపూడిలోని శ్రీఅగస్త్యేశ్వరస్వామికల్యాణం , 25న రాత్రి నత్తారామేశ్వరంలోని శ్రీరామలింగేశ్వరస్వామి కల్యాణ ఉత్సవం జరుగుతుందని ఆలయాల కార్యనిర్వహణాధికారులు తెలిపారు. ఈ నెల 26న మహాశివరాత్రి రోజున మూడు ఆలయాల వద్ద తీర్థ మహోత్సవం, నిర్వహించిన అనంతరం జుత్తిగ రామేశ్వరం గ్రామాల్లో రథోత్సవాలు నిర్వహించి, అనంతరం రాత్రి గ్రామ పొలిమేరల్లో రామేశ్వర స్వామికి, జుత్తిగ సోమేశ్వర స్వామివారికి ఎదురు సన్నాహ ఉత్సవం బాణసంచా కాల్పులతో అత్యంత వైభవంగా నిర్వహించనున్నారు.

కాశీ పుణ్యక్షేత్రంతో సమానంగా

పశ్చిమ అభిముఖంగా శివలింగం ఉండి, నది ఉత్తరంగా ప్రవహించే ప్రాంతంలో ఉన్న క్షేత్రాన్ని కాశీతో సమానమైన పుణ్యక్షేత్రంగా భక్తులు భావిస్తారు. అలాంటి క్షేత్రం పెనుమంత్ర మండలం జుత్తిగ గ్రామంలో శ్రీఉమావాసుకి రవి సోమేశ్వరస్వామి ఆలయమని పండితులు చెబుతు న్నారు. ఇక్కడ సోమేశ్వరుడికి శత్రునాసుకుడిగా , మృత్యుంజయుడిగా భక్తులు కొలుస్తుంటారు. జుత్తిగలో ఈ ఆలయం ఉత్తరాన దక్షిణ అభిముఖంగా పార్వతిదేవికి ఎడమ భాగంగా భద్రకాళీ, వీరభద్రుడు, సోమేశ్వరుని లింగానికి ఎదురుగా ముఖ మండపం అనిశ్రమ, శారదాదేవి, కుమారస్వామి, జగద్గురు ఆదిశంకరాచార్యులు, కుమార స్వామి నెలకొని ఉండగా, స్మార్తాండం ప్రకారం ఆలయ మొదటి ప్రకారంలో పంచాయతన పద్ధతిలో, వాయువ్యాన శ్రీలక్ష్మీ జనార్ధనస్వామి, ఈశాన్యాన సూర్యనారాయణ మూర్తి, కాల భైరవస్వామి, ఆగ్నేయాన గణపతి, నైరుతిన శ్రీదుర్గా దేవి ప్రతిష్ఠించి పూజలు చేస్తున్నారు. ఆలయానికి ఉత్తరం వైపున నవగ్రహాలైన మరో ప్రాకారంలో కామాక్షి అమ్మవారు కొలువై ఉండగా, పశ్చిమ వైపు మరో ప్రాకారంలో శ్రీవల్లీదేవసేన సమేత సుబ్రహ్మణ్యేశ్వర స్వామి కొలువై ఉన్నారు. పక్కనే చంద్ర పుష్కరిణి అనే కోనేరు స్నానఘట్టం ఉంది. శ్రీ రామచంద్రుడు కూడా ఆ ఆలయాన్ని సందర్శించినట్లు పురాణాలు చెబుతున్నాయి. ఇక్కడ అభిషేకం చేయించుకుని స్వామిని దర్శించుకున్నవారికి శత్రుభయం, మృత్యుభయం కూడా దరిచేరవని ఇక్కడ భక్తుల నమ్మకం.

సకల పాపహరుడు నత్తారామేశ్వరుడు

నత్తారామేశ్వర గ్రామంలోని శ్రీరామలింగేశ్వరస్వామికి సకల పాపహరుడిగా పేరుంది. పరశురాముడు శత్రురాజులను జయించిన అనంతరం పాప పరిహారార్థం ఇక్కడ గోస్తనీ గర్భంలో లింగ ప్రతిష్ఠ చేసినట్లు క్షేత్ర మహత్యం ద్వారా తెలుస్తుంది. శ్రీరాముడు సేతుబంధనాన రామేశ్వరుడిని ప్రతిష్ఠించి అయోధ్యకు వెళ్తూ, ఇక్కడ నదిలో స్నానం ఆచరించి సీతారామ సమేత లక్ష్మణుడు ఇక్కడ మరో రెండు లింగాలను ప్రతిష్ఠించినట్లు పురాణాల ద్వారా తెలుస్తుంది. పరశురాముడు, సీతారాముడు, లక్ష్మణుడు ప్రతిష్ఠలు చేసిన మూడు లింగాలు ఈ ఆవరణలో ఉండడం వల్ల ఈ ఆలయం త్రిలింగ క్షేత్రంగా ప్రసిద్ధి చెందింది. మహా శివరాత్రినాడు గోస్తనీనదిలో భక్తులు స్నానాలు ఆచరించి త్రిలింగాలను దర్శించుకుంటారు.

రేపటి నుంచి శివరాత్రి మహోత్సవాలు

పెనుగొండ: స్థానిక శ్రీనగరేశ్వర మహిషాసుర మర్ధనీ వాసవీ కన్యకపరమేశ్వరి ఆలయంలో మహాశివరాత్రి మహోత్సవాలు ఈ నెల 22 నుంచి మార్చి 1 వరకూ నిర్వహించనున్నట్లు ఆలయ కార్యనిర్వహణాధికారి గుబ్బల రామ పెద్దింట్లు రావు తెలిపారు. గురువారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ 26న మహాశివరాత్రి పర్వదినం సందర్భంగా రథోత్సవం నిర్వహిస్తామని స్పష్టం చేశారు. ఆఖరి రోజున నగరేశ్వర స్వామి పుష్ప యాగం నిర్వహిస్తామని వివరించారు.

మహిళ కడుపులో 10 కిలోల కణితి తొలగింపు



తొలగించిన 10 కిలోల కణితి

పాలకొల్లు అర్బన్: ఓ మహిళ కడుపులో ఉన్న కణితిని గుర్తించి దానిని వైద్యులు తొలగించారు. పాలకొల్లు పట్టణంలోని ఓ ప్రైవేటు ఆస్పత్రిలో ఈ చికిత్స చేశారు. విజయవాడకు చెందిన 52 ఏళ్ల మహిళ తీవ్రమైన కడుపు నొప్పితో బాధపడుతుండగా చికిత్స అనంతరం కణితి ఉన్నట్టు గుర్తించారు. ఆమెకు సుమారు రెండు గంటలపాటు శస్త్ర చికిత్స చేసిన వైద్యులు దానిని తొలగించారు. తొలగించిన కణితి బరువు సుమారు 10 కిలోలు ఉందని డాక్టర్ సురేష్‌బాబు తెలిపారు.